# ఉంగరం



-ప్రభాకర

జానకీ!

నీవు కోరిన అందె ఉంగరం కోసం అరతులం బంగారం కొని పది రోజుల క్రితం కంసాలికిచ్చాను. ఈ ఉంగరం అంటే నీకెంత యిష్టమో దీని గురించి ఎన్ని నెలల బట్టి నాకు చెబుతూవచ్చావో కూడా బాగా జ్ఞాపకం. నా అశ్రద్ధ వల్లే యింత ఆలస్యం అయింది.

ఉంగరం వంకీకి ఎర్రరాళ్ళు వేసి మధ్య పచ్చరాయి వేసి చేయించమన్నావు. దాన్ని తలుచుకునే నువ్వెంత మురిసిపోయావో కూడాతెలుసు. నీ ఆనందాన్ని పంచుకోవాలని నేనూ ఆ ఉంగరాన్ని ఊహించుకోవాలని అనేకసార్లు ప్రయత్నం చేసినా నా మనోనేత్రంతో, నే చూడ గలిగింది మాత్రం నువ్వు నేనిచ్చిన కొత్త చీర కట్టుకుని ఈ ఉంగరాన్ని నన్నే నీ వేలుకు పెట్ట మన్నట్లుగా చిరునవ్వుతో నిలుచున్న నీరూపాన్ని. నీ తొందర చూసి బ్రహ్మానికి మళ్ళీ కబురు చేయగా యీ సోమవారం నాడు యిస్తానన్నాడు.

ప్రత్యేకంగా సోమవారం నేను బ్రహ్మం వీరయ్య తెచ్చి యివ్వబోయే నీ ఉంగరం కోసమే వేచివున్నాను. సాయంత్రం 4 గంటలకు మీ ఆఫీసుకు ఫోను చేస్తే నీవు ముక్తసరిగా మాట్లాడావు. ఉంగరం వచ్చిందని ఆఫీసు నుంచి యింటికి వెళ్ళేటప్పుడు యిటువచ్చి తీసుకువెళ్ళమన్నాను. సరేనన్నావు. అప్పటికి నీవు వస్తావు కదా ,అని సంతోషంగా వున్నాను. వీరయ్య అప్పటికింకా ఉంగరం తేకపోయినా, సాయంత్రం 5 గంటలైనా వీరయ్య ఉంగరం తేలేదు. ఇంతలో మీ తమ్ముడు బుజ్జిబాబు 'టేప్' కోసం రాగా యిప్పుడే యిస్తా కూర్చోమని నీకో వుత్తరం రాసి కవర్లో పెట్టాను. అందులో మరికొన్ని ముఖ్య విషయాలతో పాటు నిన్ను సరదాకి ఉంగరం వచ్చిందని ఊరించి ఏడిపించాలని ఫోనులో అల్లా చెప్పావనిన్నూ, దానికి నన్ను క్షమించమనిన్నూ రాశాను. నేనూహించింది—ఏ కారణం చేతేనా నీవు రావటానికి వీలు పడకపోతే రాత్రంతా నిద్ర పాడుచేసుకుంటావని, నీ నిరాశ ఎక్కువైన కొద్దీ తిరిగి నిన్ను ప్రసన్నం చేసుకోవటం మరింత కష్టమని నా అనుభవం వల్ల తెలిసి వుండటం చేత నిజం తెలిపి ఆ ఉత్తరం 'టేప్' తో పాటు బుజ్జిబాబు చేత పంపాను. ఒకవేళ ఆఫీసు నుంచి నీవిటు వచ్చి వెడితే అప్పుడే నిజం చెప్పి నీ చిరుకోపాన్ని కూడా చూసి ఆనందించ వచ్చుననుకున్నా.

కాని నీవు రాలేదు. నీ కోసం రాత్రి 10 గంటల దాకా వేచివుండి, యికరావని నిర్ణయించుకుని నిద్రలోకి జారుకున్నా.

ఈ ఉదయం 8 గంటలకు అంటే యిప్పటికి ఓ రెండు గంటల ముందు మీ తమ్ముడు బుజ్జిబాబు రావటం గమనించి నీనుంచి ఏదో తీయటి మాటో లేదా ప్రేమలేఖో వస్తుందని ఆశించి, ప్రతిఫలంగా నిన్ను మరింత సంతోష పెట్టాలని డ్రాయరు సొరుగు లాగాను.

ఆత్రంగా బుజ్జిబాబు నా దగ్గరకు వచ్చి 'మా అక్క ఉంగరం పట్టుకురమ్మంది' అనగానే చిన్న షాక్ తిన్నట్లు ఫీలయి ఆశ్చర్యపోయా. నిన్న సాయంత్రం నేనిచ్చిన వుత్తరం నీ కంది కదా అని బుజ్జిబాబును ఆరాతీయగా నిన్నే యిచ్చానన్నాడు. ఆ క్షణంలో నా మనస్సులో వస్తున్న ఆలోచనలకు అడ్డుకట్ట వేసి ఉంగరం కూడా ఆ కవర్లోనే ఉంది, కవరు చింపి ఉత్తరం ఓసారి మీ అక్కను చూడమను అని చెప్పి పంపాను. ఈ రెండు గంటలనుంచి నా ఆలోచనలు ఎన్ని రకాలుగా పోయాయో, నే వర్ణించ లేను.

జానకీ! నీవు కోరిన మరొకటి కూడా గుర్తుంది. కాని ఆర్థిక యిబ్బందుల వల్ల వెంటనే తీర్చలేకుండావున్నా. పంట డబ్బు వచ్చిన తక్షణం అదికూడా తప్పక తీర్చగలను. నువ్వు నాకు చేయగలిగిన ప్రత్యుపకారం ఒకటుంది. నేను నీకు రాసి పంపిన ప్రేమలేఖల్లో కొన్నైనా నీకంట బడకుండా నీ దిండు క్రింది వుండి వుండవచ్చు. దయచేసి అవి నాకు తిప్పి పంపు జానకీ! నేను నిజంగా అవి తిరిగి రాయాలంటే రాయలేక పోవచ్చు. అవి చదువుకుంటూ విరామ సమయంలో నా మనో విశ్లేషణ నాకు నేనై చేసుకుందుకైనా ఉపయోగ పడవచ్చు.

ఈ ఉత్తరం మీ పక్కింటి రామం చేత పంపుతున్నా. దీంతోపాటు నిన్న రాత్రి వీరయ్య అనుకున్న సమయానికి కొన్ని గంటల ఆలస్యంతో తీసుకువచ్చి యిచ్చిన నీ ఉంగరం పంపుతున్నా. నిన్ను ఆశ్చర్యంలో ముంచాలనుకున్న నే నాపని చేయగలిగానా? లేక నువ్వే నన్ను ముంచావా—ఆశ్చర్యంలో.

ఇట్లు

నీతో మొదటి పరిచయం అయినప్పుడే నిన్ను ఎప్పుడూ ప్రేమిస్తూ వుండాలని, నాకు నేనుగా నిర్ణయించుకున్న రామారావుని.